

కౌన్ బనేగా చైర్మన్

మార్కెట్ కమిటీల నియామకం చేపట్టనున్న నేపథ్యంలో పరిగి చైర్మన్ పదవికి ఆశావహులు పోటీ పడుతున్నారు. 8లో▸



జోరుగా వడ్డీ వ్యాపారం!

ఇబ్రహీంపట్నం డివిజన్‌లో వడ్డీ వ్యాపారం జోరుగా సాగుతోంది. నిత్యం కోట్లల్లో ఆర్థిక లావాదేవీలు జరుగుతున్నాయి. 8లో▸

రంజాన్ వేళలు

ఇఫ్తార్ :	సహర్ :
బుధవారం (సాయంత్రం) 6:31	గురువారం (ఉదయం) 5:03

న్యూస్‌రీల్

బయోమెట్రిక్ విధానం వద్దు



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

అనంతగిరి: అంగన్‌వాడీ కేంద్రాల్లో సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ పెట్టాలనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య డిమాండ్ చేశారు. మంగళవారం అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో చలో కలెక్టరేట్ కార్యక్రమం నిర్వహించారు. అడిషనల్ కలెక్టర్ లింగ్యా నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఐసీడీఎస్ బలోపేతం చేయడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలన్నారు. సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు నర్సమ్మ, నాయకులు లక్ష్మి, లలిత, మనోహర, సుజాత, భారతి, రేణుక, వసంత మాల, పద్మ తదితరులు పాల్గొన్నారు.

15న తాండూరుకు కేటీఆర్

తాండూరు: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఈ నెల 15న తాండూరుకు రానున్నట్లు మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో తాండూరు పట్టణంలోని వినాయక కన్వెన్షన్ హాల్‌లో నియోజకవర్గ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి కేటీఆర్ తోపాటు మాజీ ఎమ్మెల్సీ కాసాని జ్ఞానేశ్వర్, ఉమ్మడి జిల్లా నాయకులు హాజరుకానున్నట్లు తెలిపారు. నియోజకవర్గం నుంచి భారీ సంఖ్యలో కార్యకర్తలు హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

18న బహిరంగ వేలం

అనంతగిరి: వికారాబాద్ పోలీసు శిక్షణ కేంద్రంలో పనికిరాని, పాత, చెడిపోయిన వస్తువులకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఎస్పీ కోటిరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 18వ తేదీ ఉదయం 10.30 గంటలకు వేలం ఉంటుందని, ఆసక్తిగల వారు పాల్గొనవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు సెల్ నంబరు 8712670028లో సంప్రదించాలని సూచించారు.

ఆమనగల్లు లయన్స్‌క్లబ్‌కు అవార్డుల పంట

ఆమనగల్లు: లయన్స్‌క్లబ్ ఆఫ్ మల్టీపుల్ 320 జిల్లా పరిధిలోని వివిధ లయన్స్‌క్లబ్‌లలో అత్యుత్తమ సేవలు అందించినందుకు గాను ఆమనగల్లు లయన్స్‌క్లబ్‌కు ఉత్తమ లయన్స్‌క్లబ్‌గా, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు యాచారం వెంకటేశ్వర్లుగౌడ్ ఉత్తమ లయన్స్‌క్లబ్ అధ్యక్షుడిగా అవార్డులు అందుకున్నారు. హైదరాబాద్‌లోని కర్మాన్‌ఘాట్ ఏపీఆర్ గార్డెన్స్‌లో మంగళవారం లయన్స్‌క్లబ్ ఆఫ్ మల్టీపుల్ 320 రీజియన్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రీజియన్ లయన్స్‌క్లబ్ పరిధిలోని వివిధ క్లబ్‌ల్లో నిర్వహించిన సేవా కార్యక్రమాలకు గాను అవార్డులు అందించారు. ఆమనగల్లు లయన్స్‌క్లబ్‌కు మొత్తం వివిధ విభాగాల్లో పది అవార్డులు లభించాయి. ఉత్తమ లయన్స్‌క్లబ్‌గా, ఉత్తమ అధ్యక్షుడిగా వెంకటేశ్వర్లుగౌడ్, ఉత్తమ కార్యదర్శిగా గోవర్ధన్‌రెడ్డి, కోశాధికారిగా కొర్వి వెంకటయ్య, ఉత్తమ పీఆర్‌ఓగా పాషాకు అవార్డులు లభించాయి. బెస్ట్ మెగా హెల్త్‌క్యాంపు, బెస్ట్ బ్లడ్ డొనేషన్ క్యాంపు, బెస్ట్ ఐ క్యాంప్స్, బెస్ట్ వీల్స్ ఆన్ మీల్స్ తదితర విభాగాల్లో ఆమనగల్లు లయన్స్‌క్లబ్‌కు అవార్డులు వచ్చాయి. అవార్డులను లయన్స్‌క్లబ్ రీజియన్ చైర్మన్ సాధు ప్రభాకర్‌రెడ్డి అందించారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు



రౌడీషీటర్స్‌తో మాట్లాడుతున్న ఏసీపీ రాజు

ఇబ్రహీంపట్నం: శాంతిభద్రతలకు విఘాతం సృష్టించినా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు హెచ్చరించారు. డివిజన్ పరిధిలోని రౌడీ షీటర్స్‌ను మంగళవారం ఇబ్రహీంపట్నం ఏసీపీ కార్యాలయానికి పిలిపించారు. వారికి ప్రత్యేకంగా కౌన్సెలింగ్ ఇచ్చి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. రానున్న లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో గొడవలు, కొట్లాటలు సృష్టించి శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సీఐ సత్యనారాయణ, ఎస్‌ఐ మారయ్య తదితరులు పాల్గొన్నారు.

‘రియల్’ మాయ

పరిగి నియోజకవర్గంలో భూముల ధరలు అమాంతం పెరగడంతో రియల్టర్ల కన్ను పడింది. వ్యవసాయ భూములను కొనుగోలు చేసి ఎలాంటి అనుమతులు పొందకుండానే అక్రమ ప్లాటింగ్ చేసి విక్రయిస్తున్నారు. ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారు.

పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న ఫాం లేఅవుట్లు
- వ్యవసాయ భూమిని కన్వర్షన్ చేయకుండానే ప్లాట్లు చేసి విక్రయాలు
- ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి
- చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు



దోమ మండలం తిమ్మాయిపల్లిలో అక్రమంగా వెలసిన వెంచర్

పరిగి: ప్రభుత్వ అనుమతులు పొందకుండానే రియల్టర్లు వ్యవసాయ భూములను ఫాం లేఅవుట్లుగా మార్చేస్తున్నారు. నాలా (నాన్ అగ్రికల్చర్ ల్యాండ్ అసెస్‌మెంట్ యాక్ట్) చట్టానికి తూట్లు పొడుస్తున్నారు. అక్రమంగా ప్లాట్లు చేసి సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోంది. రియల్టర్ల అక్రమాలు తెలిసినా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. విమర్శలు వచ్చినప్పుడు మాత్రం హడావుడి చేస్తున్నారు. నామమాత్రపు చర్యలు, నోటీసులతో సరిపెడుతున్నారు. ఎవరైనా ఒత్తిడి చేస్తే స్పందిస్తున్నారు. నాలా కన్వర్షన్ కూడా చేయకుండా వ్యవసాయ భూములను ప్లాట్లు చేసి విక్రయిస్తున్నారు. పంచాయతీల నుంచి అనుమతులు లేకుండా పొలాల్లో బీటీ, సీసీ రోడ్లు, శాశ్విత నిర్మాణాలు చేపడుతున్నారు. పరిగి నియోజకవర్గంలో భూముల ధరలకు రెక్కలు రావడంతో రియల్ ఎస్టేట్ వ్యాపారం ఊపందుకుంది. కొంత మంది రియల్టర్లు వ్యవసాయ భూముల్లో అనధికారికంగా ప్లాటింగ్ చేస్తూ క్రయ విక్రయాలకు పాల్పడుతున్నారు.

అనుమతులు లేకుండానే..

వ్యవసాయ భూములను రియల్ వెంచర్లుగా మార్చాలంటే ముందుగా ప్రభుత్వ అనుమతి పొందాలి. అయితే కొంత మంది రియల్టర్లు వ్యవసాయేతర భూమిని ప్లాట్లుగా మార్చి నాలా కన్వర్షన్ చేయించి, గుంటలు, గజాల చొప్పున విక్రయిస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతోంది. నాలా, కన్వర్షన్ చేయించినా ప్లాట్లు వేయాలంటే పంచాయతీ అనుమతులు పొందాలి. అవేవీ తీసుకోకుండానే ప్లాట్లు వేసి విక్రయిస్తున్నారు.

ఉదాహరణకు కొన్ని..
- ❖ పరిగి పట్టణ సమీపంలోని తుంకుల్‌గడ్డ మార్గంలో కొంత మంది రియల్టర్లు రెండు ఎకరాల భూమిని కొనుగోలు చేసి లే అవుట్ వేసి గుంటల చొప్పున విక్రయిస్తున్నారు.
- ❖ పరిగి మండలం రూప్‌ఖాన్‌పేట గ్రామ సమీపంలో ఎలాంటి అనుమతులు లేకుండానే ప్లాట్లు చేసి అమ్మేస్తున్నారు.
- ❖ కుల్కచర్లలో బండవెల్కిచర్ల మార్గంలో అక్రమంగా వెంచర్ వేసి అమ్ముతున్నారు.
- ❖ కుల్కచర్ల మండలం ఇప్పాయిపల్లి సమీపంలో ప్లాట్లను గుంటల లెక్కన విక్రయిస్తున్నారు.
- ❖ కుల్కచర్లలోని పరిగి మార్గంలో ఎలాంటి అనుమతులు లేకుండా ప్లాట్ల దందా చేస్తున్నారు.
- ❖ దోమ మండలం తిమ్మాయిపల్లి సమీపంలో ఐదు ఎకరాలను ప్లాట్లుగా మార్చి విక్రయిస్తున్నారు.

ఇష్టానుసారంగా వెంచర్లు

వ్యవసాయ భూమిని వెంచర్‌గా మార్చాలంటే ఎకరం భూమిలో 10 శాతం స్థలాన్ని గ్రామ పంచాయతీ పేరిట రిజిస్ట్రేషన్ చేయాలి. వెంచర్ చేపడుతున్న స్థలంలో ప్రజల అవసరాల దృష్ట్యా మౌలిక వసతులైన 30 ఫీట్ల రోడ్డు, డ్రైనేజీ, విద్యుత్, నీటి సౌకర్యం కల్పించాలి. కానీ ఇవేవీ లేకుండా ఇష్టానుసారంగా వెంచర్లు వేస్తున్నారు. అక్రమ వెంచర్లతో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయి. ఈ విషయం రెవెన్యూ అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అక్రమ వెంచర్లపై విచారణ చేపట్టాలని వారు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం



అనుమతులు లేకుండా వెంచర్లు చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. అనుమతులు లేని వెంచర్లలో ప్లాట్లను కొనుగోలు చేయరాదు. సరైన పత్రాలు ఉంటేనే కొనుగోలు చేయాలి, లేకుంటే ఇబ్బందులు తప్పవు. ప్రజలు ఈ విషయాన్ని గుర్తించాలి.

– విజయకుమారి, వికారాబాద్ ఆర్డీఓ



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్, అదనపు కలెక్టర్లు, అధికారులు

ఎన్నికలకు సిద్ధం కండి

కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్ అర్బన్: రానున్న లోక్‌సభ ఎన్నికలకు అన్ని శాఖల అధికారులు సిద్ధం కావాలని కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశించారు. స్పష్టమైన ఎలక్టోరల్ రోల్‌ను తయారు చేయాలని, ఎన్నికల షెడ్యూల్‌కు ముందే పెండింగ్ పనులన్నీ పూర్తి చేసుకోవాలని సూచించారు. మంగళవారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్ రాజ్ నిర్వహించిన టెలికాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ అనంతరం జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. పారదర్శకమైన ఓటరు జాబితాను సిద్ధం చేయాలని, ఓటరు జాబితాలో మార్పులు చేసే క్రమంలో జాగ్రత్తలు పాటించాలని నోడల్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు రాహుల్ శర్మ, లింగ్యా నాయక్, ఆర్డీఓ విజయ కుమారి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత

- ప్రభుత్వ భూముల జోలికొస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం
- మొయినాబాద్ తహసీల్దార్ గౌతమ్‌కుమార్



ప్రభుత్వ భూమిని పరిశీలిస్తున్న అధికారులు

మొయినాబాద్: ప్రభుత్వ భూముల జోలికొస్తే ఎంతటివారినైనా వదిలేది లేదని మొయినాబాద్ తహసీల్దార్ గౌతమ్‌కుమార్ హెచ్చరించారు. మండల పరిధిలోని చిలుకూరు రెవెన్యూలోని సర్వేనంబర్ 277లో, హిమాయత్‌నగర్ రెవెన్యూలోని సర్వేనంబర్ 151లో ప్రభుత్వ భూమిని కబ్జా చేసి చేపట్టిన నిర్మాణాలను మంగళవారం రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములను కబ్జాచేసి నిర్మాణా లు చేపడితే చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వ భూములను కాపాడటం తమ బాధ్యత అన్నారు.

దురుసుగా ప్రవర్తించిన కబ్జాదారులు..

చిలుకూరు రెవెన్యూలోని సర్వేనంబర్ 277లో ప్రభుత్వ భూమిని పరిశీలిస్తున్న తహసీల్దార్ గౌతమ్‌కుమార్‌పై కొందరు కబ్జాదారులు దురుసుగా ప్రవర్తించారు. ప్రభుత్వ భూమి ఎక్కడెక్కడ కబ్జా అయిందని తహసీల్దార్ పరిశీలిస్తుండగా ఓ కబ్జాదారుడు వచ్చి మేం కబ్జా చేశామని ఎలా అంటావ్ అంటూ తహసీల్దార్‌తో వాగ్వాదానికి దిగాడు. మండల మెజిస్ట్రేట్ అయిన తహసీల్దార్‌ను బూతులు తిడుతూ ఆయనతోపాటు రెవెన్యూ సిబ్బందిపై దాడి చేసేందుకు యత్నించారు. ప్రభుత్వ భూమిని కబ్జా చేయడమే కాకుండా తహసీల్దార్‌పైనే దాడికి యత్నిస్తారా అంటూ స్థానికులు కబ్జాదారులను అడ్డుకున్నారు.

చెరువుల చెర వీడేనా?

యథేచ్ఛగా ఆక్రమణలు
- కలెక్టర్ ఆదేశాలతో కదిలిన రెవెన్యూ యంత్రాంగం
- జిల్లాలో సర్వే ప్రారంభం
- తుర్కయంజాల్‌లోని మాసబ్ చెరువు నుంచి మరూ..



మాసబ్ చెరువు వద్ద సర్వే చేపడుతున్న అధికారులు

తుర్కయంజాల్: ఆక్రమణకు గురవుతున్న చెరువులు, కుంటలను కాపాడటంతో పాటు ఇప్పటి వరకు అన్యాక్రాంతమైన వాటిని గుర్తించడం.. పూర్తి స్థాయి నీటి మట్టం పరిధి.. బఫర్ జోన్ నిర్ధారించే ప్రక్రియ ఎట్టకేలకు సోమవారం జిల్లాలో ప్రారంభమైంది. దీంతో ఇన్ని రోజుల పాటు అడ్డూ అదుపు లేకుండా కొనసాగిన చెరువులు, కుంటలు, వాగు లు, వంకల ఆక్రమణకు ఇకనైనా అడ్డుకట్ట పడనుందా అన్న చర్చ మొదలైంది. చెరువులు, కుంటల ఆక్రమణలకు అడ్డుకట్ట వేయాలని భావించిన కలెక్టర్ శశాంక ఇటీవల ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపాలిటీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి ఆక్రమణలకు గురవుతున్న చెరువులను ముందుగా సర్వే చేసి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ఇందులో భాగంగా జిల్లాలోని పెద్ద చెరువుల్లో ఒకటైన తుర్కయంజాల్‌లోని మాసబ్ చెరువు పరిధిలో మంగళవారం ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపాలిటీ అధికారులు సంయుక్తంగా సర్వే ప్రారంభించారు.

జిల్లాలో 2,132 చెరువులు

జిల్లాలో మొత్తం 2,132 చెరువులు, కుంటలు ఉండగా, 10,946 ఎంఎఫ్‌టీ సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయి. వీటి పరిధిలో 70,067 ఎకరాల ఆయకట్టు ఉంది. వీటి ద్వారా ఏటా 400 టన్నులకు పైబడి చేపల దిగుబడి వస్తుంది. చెరువులకు ఎఫ్‌టీఎల్ నిర్ధారించి ఆక్రమణలకు గురికాకుండా కాపాడాల్సిన అధికారులు పట్టీపట్టనట్లుగా వ్యవహరించారు. ఇష్టానుసారంగా నిరభ్యంతర పత్రాలు జారీచేసి అనేక చెరువులు, కుంటల్లో రియల్ ఎస్టేట్ వెంచర్లు పుట్టుకురావడానికి కారణం అయ్యారు. 2016లో తుర్కయంజాల్‌లోని మాసబ్ చెరువు ఎఫ్‌టీఎల్ పరిధి సర్వే నంబర్ 205లోని 12 ఎకరాల భూమికి ఎన్‌ఓసీ జారీచేశారు. ఏడాది క్రితం ఆ భూమిలో 5 అడుగుల కంటే ఎక్కువగా నీరు నిలిచి ఉండగా వందల కొద్ది టిప్పర్ల సాయంతో పెద్దపెద్ద బండరాళ్లు, మట్టిని నింపి పూడ్చివేశారు. దీనిపై ‘సాక్షి’ వరుస కథనాలు ప్రచురించడంతో స్థానికంగా ఇది ఉద్యమానికి దారితీసింది. అయినా అధికారులు నామమాత్రపు చర్యలు తీసుకుని చేతులు దులుపుకొన్నారు. ఆ సమయంలో అధికారులపై పెద్ద ఎత్తున అవినీతి, ఆరోపణలు వచ్చాయి.

అక్రమాల పుట్ట బయట పడేనా?

320 ఎకరాల శిఖం భూమి, 179 ఎకరాల పట్టా భూముల్లో మాసబ్ చెరువు విస్తరించి ఉంది. ఈ చెరువు పరిధిలో సుమారు 100 ఎకరాలకు పైగా ఎఫ్‌టీఎల్ పరిధిలో ఇప్పటికే పలు వెంచర్లు వెలిశాయి. 2020లో పలు నిర్మాణాలు చేపట్టినట్లు అధికారులు గుర్తించారు. ఈ చెరువు పరిధిలోని సర్వే నంబర్లు 58, 59, 60, 61, 62, 63, 64, 65, 69, 77, 73, 109, 110, 113, 94, 100, 101, 103, 38, 37, 35, 36, 205, 204, 159, 203, 162, 163, 164, 165తో పాటు పలు సర్వే నంబర్లలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు ఇప్పటికే పలు వెంచర్లు చేసి అమాయకులకు ప్లాట్లు విక్రయించారు. అధికారులు పక్కాగా సర్వే నిర్వహించి చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ నిర్ణయిస్తే అక్రమార్కుల చిట్టా మొత్తం బయట పడే అవకాశం ఉందని భావిస్తున్నారు.

జిల్లాలో ఉన్న చెరువులు, కుంటలు, ఆయకట్టు వివరాలు

చెరువులు	డివిజన్-1	డివిజన్-2	చేవెళ్ల	షాద్‌నగర్	కల్వకుర్తి
100కు పైగా	60	376	203	28	18
100లోపు	732	-	-	432	280
సామర్థ్యం	6,046.28	1,104	913	1,322.22	1,560.9
ఆయకట్టు	31,936.28	7,850	6,845	13,265.23	10,170.28

వరుస ప్రమాదాలతో బెంబేలు

ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితం.. సుఖప్రదం అనేది సంస్థ నినాదం.. అయితే తాండూరు డిపోలో ఇందుకు విరుద్ధంగా కొనసాగుతోంది. అధికారుల నిర్లక్ష్యం.. పర్యవేక్షణ లోపం కారణంగా తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ప్రయాణికుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి.

- రోడ్లపైకి ఫిట్‌నెస్ లేని బస్సులు
- ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటం
- తరచూ అదుపు తప్పుతున్న తాండూరు ఆర్టీసీ బస్సులు
- నాలుగు నెలల్లో ఆరు యాక్సిడెంట్లు
- డ్రైవర్లకు డబుల్ డ్యూటీలతో ఇబ్బందులు



నకిరికేకల్ వద్ద ప్రమాదానికి గురైన తాండూరు ఆర్టీసీ డిపో బస్సు (ఫైల్)

తాండూరు: తాండూరు ఆర్టీసీ డిపో బస్సులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నాయి. దీంతో ప్రయాణికులు హడలిపోతున్నారు. డ్రైవర్లకు డబుల్ డ్యూటీలు వేయడంతోనే ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ నెల 7న తాండూరు నుంచి భద్రాచలం మీదుగా జగదల్పూర్‌కు బస్సు బయలుదేరింది. వందల కిలోమీటర్ల ప్రయాణం కావడంతో ఇద్దరు డ్రైవర్లను పంపారు. శుక్రవారం రాత్రి బస్సు తాండూరుకు బయలుదేరింది. ఈ క్రమంలో నకిరేకల్ వద్ద బస్సు లారీని ఢీ కొట్టింది. బస్సు ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. ఎలాంటి ప్రాణాపాయం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. అయితే డ్యూటీలో ఉన్న ఇద్దరు డ్రైవర్లకు డబుల్ డ్యూటీ వేయడం వల్లే ప్రమాదం జరిగిందని పలువురు ఆరోపిస్తున్నారు. ఇటీవల అనంతగిరి గుట్ట మార్గంలో బస్సు బోల్తా పడటంతో ఇద్దరు ప్రయాణికులు మరణించారు. తాండూరు - మహబూబ్‌నగర్ మార్గంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి.

డబుల్ డ్యూటీలతో ముప్పు

తాండూరు ఆర్టీసీ డిపోలో 396 మంది ఉద్యోగులు విధులు నిర్వహిస్తున్నారు. డిపో పరిధిలో 51 బస్సులు ఉన్నాయి. 117 మంది డ్రైవర్లు ఉన్నారు. అయితే కండక్టర్లకు డ్రైవర్లకు సమానంగా విధులు అప్పగించాలి. కానీ అధికారులు మాత్రం తమకు అనుకూలంగా ఉన్న వారికి, రాజకీయ పలుకుబడి ఉన్న వారికి డిపోలోనే చిన్నచిన్న బాధ్యతలు అప్పగిస్తున్నారు. మిగతా కండక్టర్లకు, డ్రైవర్లకు డబుల్ డ్యూటీలు వేస్తున్నారు. మహిళా కండక్టర్లకు అర్ధ రాత్రి వరకు డ్యూటీలు వేయడం ఆందోళన కలిగిస్తోంది. గతేడాది ఓ మహిళా కండక్టర్ అర్ధరాత్రి వేళ పోలీసుల సాయంతో ఇంటికి వెళ్లింది. మహిళా కండక్టర్లకు ఉదయం 6నుంచి సాయంత్రం 7 గంటల వరకే డ్యూటీలు వేయాలి. కానీ ఈ నిబంధన అమలు కావడం లేదు.

నిబంధనల మేరకే విధులు



ఆర్టీసీ నిబంధనల ప్రకారమే కండక్టర్లు, డ్రైవర్లకు విధులు అప్పగిస్తున్నాం. అనుకూలంగా ఉన్నవారికి విధులు వేస్తున్నామనడం సరికాదు. కొంత మంది సిబ్బంది ఏదో ఒక కారణం చెప్పి సెలవులు తీసుకుంటున్నారు. అలాంటప్పుడు ఉన్న సిబ్బందికి విధులు అప్పగిస్తున్నాం. బస్సుల ఫిట్‌నెస్ విషయంలో జాగ్రత్తలు పాటిస్తున్నాం.

– సమత, మేనేజర్, తాండూరు ఆర్టీసీ డిపో

ఫిట్‌నెస్ లేని బస్సులు

తాండూరు డిపోలో సుమారు 40 వరకు ప్రైవేటు బస్సులు అద్దెకు నడుస్తున్నాయి. 14 బస్సులకు ఫిట్‌నెస్ తోపాటు బీమా గడువు ముగిసింది. ఇటీవల ఆ బస్సులను సమ్మక్క సారక్క జాతరకు పంపడంతో అసలు విషయం బయటపడింది.

మోదీ జేబు సంస్థలుగా బ్యాంకులు

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జాన్‌వెస్లీ



సమావేశంలో మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

యాచారం: దేశంలోని బ్యాంకులు ప్రధాని నరేంద్రమోదీ జేబు సంస్థలుగా మారాయని, సుప్రీం కోర్టు తీర్పులను సైతం లెక్కచేయడం లేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జాన్‌వెస్లీ పేర్కొన్నారు. మండల పరిధిలోని నక్కర్తమేడిపల్లిలో మంగళవారం పార్టీ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవినీతి మయంగా మారిందని విమర్శించారు. ఎలక్షన్ కమిషన్ లెక్కల ప్రకారం 2018 నుంచి ఇప్పటి వరకు 30 విడతల్లో 28 వేల ఎన్నికల బాండ్లను స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విక్రయించిందని, వాటి విలువ దాదాపు రూ. 16 వేల కోట్లకు పైనేనని అన్నారు. అందులో బీజేపీ రూ.10,122 కోట్లు అందుకుందని, ఇది అవినీతి కాదా అని ప్రశ్నించారు. బ్యాంకుల ఆర్థిక కార్యకలాపాలన్నీ డిజిటలైజ్ చేయాలని సుప్రీం కోర్టు ఆదేశించినా ఎస్‌బీఐలో స్పందన లేదన్నారు. ప్రధాని మోదీ ఒత్తిళ్ల కారణంగానే ఎస్‌బీఐ సక్రమంగా పనిచేయడం లేదని దుయ్యబట్టారు. మోదీకి కాపలాదారుగా పనిచేస్తున్న ఎస్‌బీఐ చైర్మన్‌ను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించితేనే పేద ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి కాడిగళ్ల భాస్కర్, జిల్లా కార్యవర్గ సభ్యులు పగుడాల యాదయ్య, బోడ సామేల్, జగదీష్, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఈవీఎం పనితీరుపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ విజయకుమార్

కొడంగల్: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఈవీఎం పనితీరుపై ఓటర్లకు అవగాహన కల్పించే కార్యక్రమాన్ని మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ విజయ్‌కుమార్, డిప్యూటీ తహసీల్దార్ సురేశ్ ఈవీఎం పనితీరును వివరించారు. సాంకేతిక సమస్యలు రాకుండా మిషన్ పనిచేసే విధానాన్ని చెప్పారు. కార్యక్రమంలో ఎలక్షన్ డీటీ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టిజన్ కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న హెచ్-82 యూనియన్ నాయకులు

మర్పల్లి: మండల పరిధిలోని పిల్లిగుండ్ల సబ్‌స్టేషన్‌లో ఆర్టిజన్‌గా విధులు నిర్వహిస్తున్న సిరిపురం గ్రామానికి చెందిన జగదీశ్ మూడు నెలలుగా అనారోగ్యంతో బాధపడుతూ ఐదు రోజుల క్రితం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఆర్టిజన్ హెచ్–82 యూనియన్ వికారాబాద్ డివిజన్ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి ఆదేశాల మేరకు సంఘం నాయకులు, మర్పల్లి యూనియన్ నాయకులు కలిసి మంగళవారం మృతుడి కుటుంబానికి రూ.25వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ వర్కింగ్ ప్రెసిడెంట్ సుభాన్, మర్పల్లి సెక్షన్ ప్రెసిడెంట్ మధు, నాయకులు మహేందర్, పెంటయ్య, స్వామి తదితరులు ఉన్నారు.

మేకలపై వీధికుక్కల దాడి

రూ.42వేల నష్టం



మేకల కళేబరాలు

ధారూరు: మటన్ షాప్ నిర్వహిస్తున్న వ్యాపారి కొనుగోలు చేసిన ఏడు మేకపిల్లలపై వీధికుక్కలు దాడిచేసి చంపేసాయి. ఈ ఘటన మండల కేంద్రంలో మంగళవారం వెలుగుచూసింది. గ్రామస్తులు తెలిపిన ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన ఫిరోజ్ ఖురేషి మటన్‌షాపు నిర్వహిస్తున్నాడు. ఈయన సోమవారం సంతలో రూ.42లు వెచ్చించి ఏడు మేకలు కొనుగోలు చేసి ఇంటివద్ద కొట్టేశాడు. రాత్రి వేల వీధికుక్కల సమూహం మేకల గుంపుపై దాడిచేసి చంపేశాయి. తెల్లవారు జామున మేకల కళేబరాలను చూసిన వ్యాపారి రూ.42 వేలు నష్టపోయానని లబోదిబోమన్నాడు.

మృతదేహం ఆచూకీ లభ్యం

యాలాల: మండల కేంద్రంలో సోమవారం లభ్యమైన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఆచూకీ లభ్యమైందని యాలాల ఎస్‌ఐ శంకర్ తెలిపారు. మృతి చెందిన వ్యక్తి మండల పరిధిలోని సంగెంకుర్దు గ్రామానికి చెందిన మాల మొగులప్ప(56)గా గుర్తించామన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

చేవెళ్ల: ద్విచక్ర వాహనం అదుపుతప్పి చెట్టును ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం .. మండలంలోని కందవాడ గ్రామానికి చెందిన కావలి యాదయ్య(55) మొయినాబాద్ మండలంలోని వీజేబీటీ కళాశాలలో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం విధులు ముగించుకొని ఇంటికి వస్తుండగా యాదయ్య మల్కాపూర్ బస్‌స్టేజీ తరువాత అతని ద్విచక్రవాహనం అదుపు తప్పి మర్రి చెట్టును ఢీకొట్టింది. దీంతో అతడు ఎగిరి కింద పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం అందించి చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి యాదయ్య మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

యాచారం: వ్యవసాయ క్షేత్రంలో పేకాటరాయుళ్లను సోమవారం రాత్రి ఎస్‌ఓటీ పోలీసులు పట్టుకున్నారు. యాచారం–మొండిగౌరెల్లి గ్రామాల మధ్యన ఓ వ్యవసాయ క్షేత్రంలో పేకాటాడుతున్నట్లు ఎస్‌ఓటీ పోలీసులకు సమాచారం అందింది. స్థావరంపై దాడి చేసిన పోలీసులు పేకాటాడుతున్న 9 మందిని అరెస్టు చేశారు. వారి వద్ద రూ.77,110 నగదు, పది మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని యాచారం పోలీసులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసుకున్న సీఐ శంకర్‌కుమార్ మంగళవారం రిమాండ్‌కు పంపించారు.



మురుగు.. పరుగు

మండల పరిధిలోని నాగులపల్లిలో కాల్వలు లేక మురుగు రోడ్లపైనే ప్రవహిస్తోంది. దీంతో దోమలు వ్యాప్తి చెంది ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారు. పట్టించుకోవాల్సిన అధికారులు కన్నెత్తి చూడడం లేదు. ఫిర్యాదు చేసినా స్పందించే వారే కరువయ్యారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. పంచాయతీ అధికారులు తాత్కాలికంగానైనా దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. – పెద్దేముల్



వరి పంటను కాపాడుకోవాలి

జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్



పంటను పరిశీలిస్తున్న గోపాల్

దోమ: వాతావరణ మార్పుల కారణంగా వరిపంటను కాపాడుకునేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి గోపాల్ సూచించారు. మంగళవారం ఆయన మండల కేంద్రంలోని పలువురి రైతుల పంటపొలాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ రైతు వ్యవసాయ అధికారులు సూచనలు, సలహాలతో పంటలను సాగు చేసుకుంటే అధిక దిగుబడులు పొందే ఆస్కారం ఉంటుందన్నారు. వరి పంటకు మొగి పురుగు, అగ్గి తెగులు సోకి పంటలు పైరు ఎండిపోయి నాశనం అవుతున్నాయని అన్నారు. ముదురు నారు నాటటం, రాత్రి తక్కువ ఉష్ణోగ్రతల నమోదు కావడంతో ఈ పరిస్థితి నెలకొంటుందని చెప్పారు. రోజుకు ఏడు గంటల కంటే ఎక్కువ సూర్యరశ్మి కారణంగా వరి పంటలో ఈ తెగులు ఆశిస్తుందని రైతులకు వివరించారు. వాటి నుంచి విముక్తి పొందడానికి అధికారుల సూచనలతో మందులను పిచికారీ చేసుకుని పంటలను కాపాడుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ విస్తరణ అధికారి కావ్య, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

బావిలో దూకి మహిళ బలవన్మరణం



యాదమ్మ మృతదేహం

యాలాల: ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఓ మహిళ బావిలోకి దూకి బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఘటన మండల పరిధిలోని రాస్నం గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ శంకర్ తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన కన్నాపురం యాదమ్మ(40), నర్సింలు కూలీపనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కొంతకాలంగా కుటుంబంలో ఆర్థిక ఇబ్బందులు పెరిగి కుటుంబ పోషణ భారమైంది. దీంతో ఆందోళన చెందిన యాదమ్మ మంగళవారం గ్రామ శివారులోని ఓ బావిలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన గ్రామస్తులు, పోలీసుల సహకారంతో మృతదేహాన్ని బావిలోంచి వెలికితీశారు. మృతురాలి తల్లి అనంతమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు



వాల్ రైటింగ్స్‌ను తొలగిస్తున్న పంచాయతీ సిబ్బంది

కుల్కచర్ల: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఎన్నికల ప్రచారానికి సంబంధించిన ప్రకటనలు గోడలపై రాయొద్దని కుల్కచర్ల పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి సూచించారు. మంగళవారం గ్రామ పంచాయతీ పరిధిలోని వాల్ రైటింగ్స్, స్టిక్కర్‌లను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే చట్టప్రకారం చర్యలుంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'దుబ్బకుంట' సంరక్షణకు చర్యలు

పరిశీలించిన తహసీల్దార్ రవీందర్‌దత్

తుర్కయంజాల్: 'దుబ్బకుంట కబ్జాదారుల కంట' అంటూ సాక్షి ప్రచురించిన కథనానికి అధికారులు కదిలారు. మంగళవారం అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ రవీందర్‌దత్ కుంటను పరిశీలించారు. ఈ నెల 18న పూర్తిస్థాయి సర్వే చేయించి సర్వే నంబర్ 631 లో ఉన్న ప్రభుత్వ భూమి 88 ఎకరాలకు హద్దులు ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ బి.సత్యనారాయణరెడ్డి సిబ్బందితో హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు.

ఎమ్మెల్యేను కలిసిన స్థానికులు

దుబ్బకుంటను కాపాడాలని కోరుతూ స్థానికులు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిసి ఫిర్యాదు చేశారు. ఎన్నో ఏళ్లుగా ఉన్న కుంటను రియల్ ఎస్టేట్ వ్యాపారులు పూర్తిగా ఆక్రమించి ప్లాట్లుగా మార్చారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే కుంటను సంరక్షించే చర్యలు చేపట్టాలని రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులను ఆదేశించినట్లు వారు పేర్కొన్నారు.

కూతురు పెళ్లికి దాచిన నగదు చోరీ

రూ.2.95 లక్షల అపహరణ, కేసు నమోదు

మీర్‌పేట: రెక్కాడితే గాని డొక్కాడని పరిస్థితి ఆ కుటుంబానిది. పొట్ట చేత్తో పట్టుకొని నగరానికి వచ్చారు. కుమార్తె పెళ్లి కోసం పైసా పైసా కూడబెట్టి దాచుకున్న నగదును దొంగలు ఎత్తుకెళ్లడంతో తల్లిదండ్రులు లబోదిబోమంటున్నారు. ఈ సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలం జూరాల గ్రామానికి చెందిన గుండాల పద్మ, హనుమంతు దంపతులు రెండేళ్ల క్రితం బతుకుదెరువు కోసం నగరానికి వచ్చారు. హస్తినాపురంలో నిర్మాణంలో ఉన్న భవనం వద్ద వాచ్‌మెన్‌గా పని చేస్తూ అక్కడే నివాసముంటున్నారు. వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. మంగళవారం తెల్లవారుజామున అందరూ నిద్రిస్తుండగా ఇద్దరు దొంగలు ఇంట్లోకి చొరబడి రూ.2.95 లక్షల నగదు, తులం బంగారు ఆభరణాలు, సెల్‌ఫోన్, డిగ్రీ సర్టిఫికెట్లు ఎత్తుకెళ్లారు. ఉదయం లేచేసరికి దొంగతనం జరిగినట్లు గ్రహించిన పద్మ వెంటనే ఠాణాలో ఫిర్యాదు చేసింది. పోలీసులు చోరీ జరిగిన ఇంటి సమీపంలోని సీసీ కెమెరాలను పరిశీలించి, క్లూస్‌టీం ద్వారా ఆధారాలు సేకరించారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. కుమార్తె పెళ్లి కోసమని కాయాకష్టం చేసి దాచిన నగదును దొంగలు ఎత్తుకెళ్లారని పద్మ విలపిస్తోంది. నగదుతో పాటు బంగారం, ఇద్దరు పిల్లల డిగ్రీ సర్టిఫికెట్లు కూడా తీసుకెళ్లారని, తమకు న్యాయం చేయాలని పోలీసులను వేడుకుంది.

సీలింగ్ భూమిలో ప్రహరీ కూల్చివేత

నందిగామ: మండల శివారులోని మేకగూడ రోడ్డు వద్ద సీలింగ్ భూమిలో వేసిన ప్రహరీని రెవెన్యూ అధికారులు మంగళవారం కూల్చివేశారు. గ్రామ శివారు సర్వే నం. 621/3 లో 1.27 ఎకరాల భూమి ని గతంలో ప్రభుత్వం గ్రామానికి చెందిన మంగళి లింగమయ్యకు కేటాయించింది. దీనిని 2005లో మరొకరు కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ సైతం చేసుకున్నారు. ఇటీవల ఆ భూమికి ప్రీకాస్ట్‌తో ప్రహరీ ని ర్మిస్తుండగా విషయం వెలుగులోకి వచ్చింది. దీనిపై ఈ నెల 7న 'సాక్షి'లో సీలింగ్ భూమికి ప్రహరీ అనే శీర్షికతో కథనం ప్రచురితమైన విషయం విదితమే. స్పందించిన తహసీల్దారు రాజేశ్వర్ నిబంధనలకు విరుద్ధంగా కొనుగోలు జరిగిందన్నారు. ఇలా భూమిని పీఓటీ యాక్ట్ ప్రకారం ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందని చెప్పారు. కాగా మంగళవారం ఆర్‌ఐ రోజా ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు జేసీబీ సహాయంతో ప్రహరీని కూల్చి వేశారు.

కౌన్ బనేగా చైర్మన్



నామినేటెడ్ పోస్టుల్లో అత్యంత కీలకమైన పదవి మార్కెట్ కమిటీ చైర్మన్. గత పాలకవర్గం పదవీకాలం ముగిసినా అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం కొత్త చైర్మన్‌ల నియామకం చేపట్ట లేదు. నియోజకవర్గ పరిధిలో పరిగి, కుల్కచర్ల రెండు మార్కెట్ యార్డులున్నాయి. ఇందులో పెద్దదైన పరిగి మార్కెట్ యార్డు చైర్మన్ పదవికి ఆశావహులు పోటీ పడుతున్నారు.

- పరిగి మార్కెట్ కమిటీ పదవికి నేతల యత్నం
- ఎమ్మెల్యేను ప్రసన్నం చేసుకునే పనిలో ఆశావహులు



పరిగి మార్కెట్ కమిటీ కార్యాలయం

పరిగి: మార్కెట్ కమిటీల నియామకం నేపథ్యంలో చైర్మన్ పదవిపై ఆసక్తి నెలకొంది. గత ప్రభుత్వం పాలకవర్గం కాలపరిమితి ముగిశాక తిరిగి నియమించ లేదు. కొత్తగా కొలువుదీరిన ప్రభుత్వం నియామకం చేపట్టనుండడంతో కాంగ్రెస్ శ్రేణుల్లోని ఆశావహులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. గత ప్రభుత్వం హయాంలో ఈ పదవికి ఎస్సీకి రిజర్వ్ చేసింది. ఇప్పుడు జనరల్ కేటగిరీకి వస్తుందనే నేపథ్యంలో పార్టీ నేతలు పైరవీలు ముమ్మరం చేశారు. పరిగి మార్కెట్ పరిసర మండలాలైన దోమ, పూడూరు వాసులు సైతం పైరవీలు వేగవంతం చేశారనే గుసగుసలు వినిపిస్తున్నాయి.

పరిగికి చైర్మన్..? దోమకు వైస్ చైర్మన్..?

పరిగి మార్కెట్ చైర్మన్ పదవి రేసులో ప్రధానంగా పలువురి పేర్లు వినిపిస్తున్నాయి. పట్టణ కేంద్రానికి చెందిన కృష్ణారెడ్డి తాను ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉంటానని.. మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి కోసం ఎమ్మెల్యేను కలిసారనే చర్చలు సాగుతున్నాయి. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పరుశురాంరెడ్డి రామ్మోహన్‌రెడ్డితో మంతనాలు జరిపిస్తున్నారు. పట్టణ అధ్యక్షుడు ఎర్రగడ్డపల్లి కృష్ణ, కౌన్సిలర్ శ్రీనివాస్‌నాయక్, సీనియర్ నాయకులు పలాద్రి శ్రీనివాస్, కడ్మూరు శ్రీను, నస్కల్ అశోక్‌లు ఆశావహుల లిస్టులో ఉన్నట్లు చర్చలు వినిపిస్తున్నాయి. వీరిలో ప్రధానంగా కృష్ణారెడ్డి, పరుశురాం రెడ్డి పేర్లను పరిశీలిస్తున్నట్లు సమాచారం. మరోవైపు పరిగి మండలానికి చైర్మన్ పదవి ఇస్తే.. దోమ మండలానికి వైస్ చైర్మన్ పదవి ఇవ్వాలని పలువురు నాయకులు కోరుతున్నారు. దోమ మండల పరిధిలోని సీనియర్ నాయకుడు నాచారం శాంత్‌కుమార్ పోటీలో ఉన్నట్లు మాట్లాడుకుంటున్నారు.

భవిష్యత్ కోసం ఆరాటం

మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి వరిస్తే జిల్లా వ్యాప్తంగా పేరు ప్రతిష్టలు సాధించవచ్చుననే ఆశావహులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. గతంలో ఎస్సీకి రిజర్వ్ అవ్వడంతో ఈ సారి జనరల్ అభ్యర్థులకు కేటాయిస్తారనే నేపథ్యంలో పోటీ తీవ్రమైంది. ఓసీలతో పాటుగా బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు తమ రాజకీయ భవిష్యత్ కోసం స్థానిక ఎమ్మెల్యేతో నిత్యం టచ్‌లో ఉండి పదవికోసం ప్రయత్నాలు చేస్తున్నారు. రెడ్డి సామాజిక వర్గానికి చెంది ఓ నాయకుడు ఎమ్మెల్యేతో గట్టి ప్రయత్నం చేస్తున్నారని ప్రత్యక్ష పోటీలో ఉండేవారికి తన సహకారం ఉంటుందని మాట ఇస్తున్నట్లు సమాచారం.

భర్త వేధింపులు తాళలేక గృహిణి ఆత్మహత్య



తుల్జమ్మ(ఫైల్)

ధారూరు: భర్త వేధింపులు తాళలేక ఓ గృహిణి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన మండల పరిధిలోని గట్టెపల్లిలో వెలుగులోకి వచ్చింది. ఎస్‌ఐ వేణుగోపాల్‌గౌడ్ తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన బేగరి శివకుమార్‌కు యాలాల మండలం పగిడియాల్‌కు చెందిన తుల్జమ్మ(32)తో 2015లో వివాహమైంది. మద్యానికి బానిసైన శివకుమార్ తరచూ భార్యను వేధిస్తున్నాడు. దీంతో విసిగిపోయిన ఆమె ఈ నెల 10న పురుగు మందు తాగింది. ఆమెను వికారాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు నగరంలోని ఉస్మానియా ఆస్పత్రికి రెఫర్ చేశారు. చికిత్స పొందుతున్న ఆమె మంగళవారం మృత్యువాత పడింది. మృతురాలి సోదరి యాదమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బాలిక అదృశ్యం.. కేసు నమోదు

ఇబ్రహీంపట్నం రూరల్: మైనర్ బాలిక అదృశ్యమైన సంఘటన మంగళవారం ఆదిబట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఆదిబట్ల మున్సిపాలిటీ మెట్రోసిటీ కాలనీలో నివాసం ఉంటున్న రామావత్ చందు కుమార్తె(14) సోమవారం ఇంట్లో నుంచి బయటకు వెళ్లింది. తిరిగి రాక పోవడంతో ఆచూకీ కోసం వెతికిన లభ్యం కాలేదు. దీంతో బాలిక తండ్రి నవీన్ అనే వ్యక్తిపై అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రాసివ్వండి..

సస్పెండ్ అయిన ఉపాధ్యాయులకు ఇన్‌చార్జి డీఈఓ నోటీసులు



సస్పెండ్ అయిన ఉపాధ్యాయుల నుంచి వివరాలు సేకరిస్తున్న అబ్దుల్‌గణి

కుల్కచర్ల: సస్పెన్షన్‌కు గురైన ఉపాధ్యాయులు ధ్రువపత్రాల విషయంలో తమ అభిప్రాయాలను లిఖితపూర్వకంగా చెప్పాలని విద్యాశాఖ కోరింది. ఈ మేరకు నారాయణపేట ఇన్‌చార్జి డీఈఓ అబ్దుల్ గణి వారికి నోటీసులివ్వగా వారు పది రోజుల గడువు కోరారు. వివరాలు ఇలా ఉన్నాయి.. నకిలీ ధ్రువపత్రాలు సమర్పించి ఉపాధ్యాయ ఉద్యోగాలు పొందారనే ఆరోపణ నేపథ్యంలో 2016లో కొంత మంది ఉపాధ్యాయులను సర్వీస్ నుంచి తొలగించారు. దీంతో వారు ఉన్నత స్థాయి కోర్టులను ఆశ్రయించారు. విచారణ నిర్వహించకుండా తొలగించడం సరికాదని.. వారిని విధుల్లోకి తీసుకుని విచారణ చేపట్టి నివేదిక అందించాలని కోర్టు ఆర్డర్ ఇచ్చింది. వీరిలో ఎల్లారెడ్డి, రాంచందర్ సస్పెన్షన్‌లో ఉండగా.. కొండారెడ్డి విధుల్లో చేరేందుకు సుప్రీం కోర్టు నుంచి ఆర్డర్స్ పొందాడు. ఈయన దోమ మండల పరిధిలోని ఐనాపూర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో స్కూల్ అసిస్టెంట్. విచారణకు హాజరైన ఫిర్యాదుదారుడు దిడ్డికాడి గోపాల్ మాట్లాడుతూ.. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో తప్పుడు ధ్రువ పత్రాలతో ఉద్యోగాలు పొందిన వారందరిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఏఎన్‌ఎంల సమస్యలు పరిష్కరించండి

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహిపాల్



ఆందోళన చేస్తున్న ఏఎన్‌ఎంలు

అనంతగిరి: ఏఎన్‌ఎంల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహిపాల్ డిమాండ్ చేశారు. మంగళవారం మెడికల్ అండ్ హెల్త్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్న ఏఎన్‌ఎంలు తమ సమస్యల పరిష్కారానికి యూనైటెడ్ మెడికల్, ఎంప్లాయీస్ యూనియన్ ఏఎన్‌ఎంల ఆధ్వర్యంలో వికారాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించారు. కార్యాలయం సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఏఎన్‌ఎంలకు నాలుగు నెలల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. తమకు కనీస వేతన చట్టం అమలు చేసి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుహాసిని, వెంకటమ్మ రజియా బేగం, భారతి, సుజాత, రాములమ్మ, సులోచన, శ్రీలత, జగదీశ్వరి, లక్ష్మి, రజియా, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

జోరుగా వడ్డీ వ్యాపారం!



నందివనపర్తిలో ప్లాట్ల విక్రయాలు లేక ఓ వెంచర్‌లో నిలిపివేసిన అభివృద్ధి పనులు

వడ్డీ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలు అన్న రీతిలో సాగుతోంది. వ్యక్తి అవసరాన్ని లక్ష్యంగా చేసుకొని వ్యాపారులు అధిక వడ్డీకి అప్పులు ఇస్తున్నారు. డివిజన్ పరిధిలో ఈ దందా అడ్డూఅదుపు లేకుండా పోయింది.

- వందకు రూ.ఐదు తీసుకుంటున్న వ్యాపారులు
- ముందస్తుగా భూముల రిజిస్ట్రేషన్లు
- రియల్ ఎస్టేట్ కేంద్రంగా సాగుతున్న దందా

యాచారం: ఇబ్రహీంపట్నం డివిజన్‌లో వడ్డీ వ్యాపారం దందా జోరుగా సాగుతోంది. నిత్యం రూ.కోట్లల్లో ఆర్థిక లావాదేవీలు జరుగుతున్నాయి. ఆరు నెలలుగా రియల్ వ్యాపారం నెమ్మదించింది. దీంతో భూముల కొనుగోలుకు చేసిన అప్పులు వ్యాపారులకు గుదిబండగా మారాయి. భూములు అమ్ముడు పోక చేసిన అప్పులు తీర్చక స్థిరాస్తి వ్యాపారులు వడ్డీ అప్పులను ఆశ్రయిస్తున్నారు. రంగారెడ్డి–నల్గొండ జిల్లాల సరిహద్దు కేంద్రంగా వడ్డీ దందా జోరుగా సాగుతుంది. వడ్డీలకు అప్పులిచ్చే వ్యాపారులు ఓ జట్టుగా ఏర్పడి మాల్ కేంద్రంగా యాచారం, మంచాల, ఇబ్రహీంపట్నం, ఆదిబట్ల, మాడ్గుల్, కందుకూర్, ఆమన్‌గల్ తదితర ప్రాంతాల్లో పర్యటించి పాత పరిచయాలను ఆసరాగా చేసుకుని వ్యాపారుల యోగక్షేమాలను తెలుసుకుంటారు. తోటి వ్యాపారుల ఆర్థిక పరిస్థితి బాగుందంటే సరి.. లేదంటే వడ్డీకి అప్పులిస్తాం.. భూములు, ప్లాట్లు రిజిస్ట్రేషన్లు చేస్తారా అని అడుగుతారు. అప్పుల్లో కూరుకుపోయిన వ్యాపారులు తక్షణ ఉపశమనం కోసం వడ్డీ ఎంతైనా సరే డబ్బులు తీసుకోవడానికి ఆసక్తి చూపిస్తున్నారు.

ముందస్తుగా రిజిస్ట్రేషన్

అప్పుల కావాల్సిన వారి భూములు, ప్లాట్లను వడ్డీ వ్యాపారులు ముందే సందర్శించి మార్కెట్లో వాటి విలువ తెలుసుకుంటారు. దానిలో సగం డబ్బులనే చెల్లించడానికి ఒప్పందం చేసుకుంటారు. అన్నీ కుదిరితే రూ.వందకు రూ.5 వడ్డీకి అప్పు ఇవ్వడానికి సిద్ధమవుతారు. వ్యక్తి అవసరాన్ని బట్టి వడ్డీని పెంచుతున్నారు. దీంతో పాటు రిజిస్ట్రేషన్ల చార్జీలు కూడా అప్పులు తీసుకునే వారే భరించాలి. ఇలా నిత్యం 20 నుంచి 30కి పైగానే రిజిస్ట్రేషన్లు అవుతున్నాయి. రోజూ వడ్డీ దందా రూ.10 కోట్లకు పైగా సాగుతుంది. యాచారం, కందుకూరు మండలాల్లో ఐదారు టీంలు వడ్డీకి అప్పును రూ.కోట్లల్లో ఇస్తున్నాయి.

నిలిచిన విక్రయాలు

అసెంబ్లీ ఎన్నికలకు ముందు రియల్ వ్యాపారం జోరుగా సాగేది. వ్యవసాయ భూములు, ప్లాట్ల విక్రయాల్లో మంచి లాభాలు రావడంతో వ్యాపారులు అప్పులు చేసి మరిన్ని భూములు కొనుగోలు చేశారు. తాజాగా రెండు, మూడు నెలలుగా రియల్ వ్యాపారం మందగించింది. వందలాది ఎకరాల్లో హెచ్‌ఎండీఏ, డీటీసీపీ నిబంధనల ప్రకారమే వెంచర్లు చేశారు. భూములు కొనడానికి, వెంచర్లుగా అభివృద్ధి చేయడానికి రియల్ వ్యాపారులు రూ.కోట్లల్లో అప్పులు చేశారు. ప్రస్తుతం కొనుగోలు చేసి వ్యవసాయ భూములతో పాటు, వెంచర్లల్లో ప్లాట్లు అమ్ముడు పోవడం లేదు. మండలంలోని ప్రముఖ రియల్ వ్యాపార కంపెనీలు వందలాది ఎకరాల్లో వెంచర్లు ఏర్పాటు చేశాయి. కానీ ప్లాట్ల విక్రయాలు లేక అభివృద్ధి పనులను వదిలేశారు.

" చర్యలు తీసుకుంటాం



వ్యాపారులు అధిక అప్పులు చేసి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దు. అప్పులు ఉంటే భూములు, ప్లాట్లు విక్రయించి తీర్చుకోవాలి. డబ్బులు ఆశ చూపి అధిక వడ్డీకి అప్పులు ఇచ్చి రైతులను ఇబ్బంది పాలు చేసే వ్యాపారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

– శంకర్‌కుమార్, సీఐ, యాచారం